బట్టలు ఆరేస్తుండగా విద్యుత్ షాక్..వివాహిత మృతి

శ్రీరాంపూర్ విషాదం

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన శారద

శ్రీరాంపూర్, జూలై 7 : శ్రీరాంపూర్ ఏరియాలోని కృష్ణాకాలనీలో నివసించే తీగుళ్ల శారద (45) ఆదివారం ఉదయం తన ఇంటిలో బట్టలు ఆరేస్తుండగా విద్యుత్‌ఘాతానికి గురై అక్కకక్కడే మృతి చెందింది. ఎస్ఐ సంతోష్‌కుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..ఆదివారం ఇంటి ఆవరణలో బట్టలు దండెంపై ఆరవేసేందుకు ప్రయత్నిస్తుండగా శారదకు ఇనుప తీగ ద్వారా విద్యుత్ ప్రసారమై విద్యుత్‌షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందింది. కుమారుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రజలు విద్యుత్ కనెక్షన్లు సక్రమంగా చూసుకోవాలని కోరారు. విద్యుత్ తీగలు, ఎలక్ట్రికల్ పోల్స్ వద్ద బట్టలు ఆరవేయవద్దని సూచించారు.

పురుగుల మందు తాగి..గోదావరిలో దూకి..

- మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

దండేపల్లి, జూలై 7 : దండేపల్లి మండల కేంద్రానికి చెందిన కట్కూరి శ్రీనివాస్(50) మతిస్థిమితం లేని వ్యక్తి పురుగుల మందు తాగి గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...శ్రీనివాస్ కొన్నేళ్లుగా మతిస్థిమితం కోల్పోయి మద్యానికి బానిస అయ్యాడు. నాలుగేళ్ల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ నెల 5న ఉదయం గేదెను మందలోకి పంపించి వస్తానని టీవీఎస్ ద్విచక్రవాహనంపై వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోయేసరికి చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో వెతికినా జాడ తెలియలేదు. ఆదివారం మృతదేహాన్ని చూసి కట్కూరి రాజన్న సమాచారం అందించాడు. అక్కడికి వెళ్లి చూసేసరికి శ్రీనివాస్ చనిపోయి ఉన్నాడు. మృతదేహం పక్కన పురుగుల మందు డబ్బా ఉండడంతో పురుగుల మందు తాగి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. మతిస్థిమితం సరిగ్గా లేక మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని భార్య ఉమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు.

ఉరేసుకొని మతిస్థిమితం లేని యువకుడు..

సిర్పూర్(టీ), జూలై 7 : మండల కేంద్రానికి చెందిన మాల్యం శివన్ కుమార్ (32) ఊరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సిర్పూర్(టీ) ఎస్ఐ దీకొండ రమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన మాల్యం లక్ష్మీకాంత 20 ఏళ్లుగా సిర్పూర్(టీ)లో నివసిస్తున్నది. లక్ష్మీకాంతకు ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు అందరికీ పెళ్లిళ్లు చేసింది. చిన్న కొడుకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో అతనికి ఇంకా పెళ్లి కాలేదు. దీంతో కొడుకు శివన్ కుమార్‌తో నివసిస్తున్నది. ఈ మేరకు లక్ష్మీకాంత ఇంటి సామగ్రి తీసుకొచ్చేందుకు ఆదివారం ఉదయం బస్టాండ్ ప్రాంతానికి వెళ్లింది. ఇంట్లో అమ్మ లేకపోవడంతో శివన్ కుమార్ ఇంటి దూలానికి తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి లక్ష్మీకాంత ఇంటికి రాగా తలుపు తీయగా కిటికి నుంచి చూడగా, శివన్ కుమార్ వేలాడుతూ కనిపించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వివాహం కావడం లేదని బావిలో దూకి..

మందమర్రి, జూలై 7: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం దీపక్‌నగర్‌కు చెందిన సురమల్ల ప్రణయ్(30) సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద గల పాడుబడ్డ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలపారు. కూలి పనులు చేసి జీవనం సాగించే ప్రణయ్ మద్యానికి బానిసవడం, వివాహం కాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తవ్వారు..వదిలేశారు..

- కొత్త రోడ్డు కోసం తవ్విన కాంట్రాక్టర్
- ఏడాదైనా పూర్తికాని పనులు
- కంకరతేలిన రోడ్డుపై వాహనదారుల తిప్పలు

కాంట్రాక్టర్ తవ్వి వదిలేసిన రంగపేట జెండావెంకటాపూర్ రోడ్డు

కంకర తేలిన రోడ్డుపై ఇబ్బంది పడుతున్న వాహనదారులు

లక్షెట్టిపేట, జూలై 7: లక్షెట్టిపేట మండలంలోని జెండా వెంకటాపూర్ నుంచి రంగపేట వరకు నూతనంగా తారు రోడ్డు వేసేందుకు గతేడాది క్రితం టెండర్లు వేయడంతో ఒక బడా కాంట్రాక్టర్ టెండర్‌ను చేజిక్కించుకుని పనులు మొదలు పెట్టాడు. కొత్త రోడ్డు వేసేందుకు పాత రోడ్డును మొత్తం తవ్వి వదిలేసాడు. సుమారు మూడు కిలోమీటర్ల మేరకు ఈ రోడ్డు పనులు చేయాల్సి ఉంది. ఇటుగా నిత్యం చాలా మంది వాహనదారులు, రైతులు తమ పొలాలకు అదే విధంగా పట్టణాలకు వెళ్తుంటారు. రోడ్డు తవ్వి వదిలేయడంతో కంకర తేలి, గుంతల మయంగా మారింది. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాలు చెడిపోతున్నాయని జెండా వెంకటాపూర్, బలరావుపేట, తిమ్మాపూర్, హన్మంతుపల్లి, చందారం, తదితర గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రోడ్డు విషయంలో చాలా సార్లు సంబంధిత అధికారుల దృష్టికి పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయంపై కాంట్రాక్టర్‌ను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

వారం రోజుల్లో చేస్తానన్నాడు.

రోడ్డు వర్క్ చేసే కాంట్రాక్టర్ ఇటీవల ఆఫీస్‌కి వచ్చాడు. రోడ్డు విషయం ఏమిటని ప్రశ్నిస్తే వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తానని, తన వద్ద ఉన్న పరికరాలు రిపేర్ ఉండడంతో ఇంత కాలం పనిలో జాప్యం జరిగినట్లు సమాధానం ఇచ్చాడు.

-తివారీ, పీఆర్ ఏఈ, లక్షెట్టిపేట

మాదకద్రవ్యాలను కలిసికట్టుగా నిర్మూలిద్దాం

- తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే కుమారస్వామి

తాండూర్ సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

కోటపల్లి : పిన్నారం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజేందర్

తాండూర్, జూలై 7 : మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తాండూర్ సీఐ కే కుమారస్వామి అన్నారు. సర్కిల్ కార్యాలయంలో శనివారం రాత్రి గంజాయి, మాదక ద్రవ్యాల నివారణపై పోలీసులు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. డ్రగ్స్ ద్వారా యువతీ యువకులు చెడు మార్గాల వైపు వెళ్తున్నారని తెలిపారు. డ్రగ్స్ మహమ్మరిని నిర్మూలిద్దామని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారని అరికట్టేందుకు పోలీసులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, నాయకులు సంయుక్తంగా చర్యలు చేపడితే సత్ఫలితాలు వస్తాయని తెలిపారు. డ్రగ్స్ వాడినా, విక్రయించినా జైలు శిక్ష అనుభవించే చట్టాలు అమల్లో ఉన్నాయని ఇది ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. గంజాయికి సంబంధించి సమాచారం ఉంటే డయల్ 100కు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే పల్లెనిద్ర..

కోటపల్లి, జూలై 7 : గ్రామంలోని సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కోటపల్లి ఎస్ఐ రాజేందర్ అన్నారు. కోటపల్లి మండలంలోని పిన్నారం గ్రామంలో పల్లెనిద్ర చేసి గ్రామంలోని సమస్యలు తెలుసుకున్నారు. చట్టాలను ఎవరూ ఉల్లంఘించవద్దన్నారు. కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరాలను నియంత్రించవచ్చని తెలిపారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదివి ఉద్యోగాలు సాదించాలని సూచించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

లక్షెట్టిపేట, జూలై 7: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని లక్షెట్టిపేట ఎస్ఐ సతీశ్ అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసై యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నదని తెలిపారు. యువత మత్తు పదార్థాలు, గంజాయి లాంటి వాటికి దూరంగా ఉండాలని కోరారు. పట్టణంలో బహిరంగంగా మద్యం తాగడం, రాష్ డ్రైవింగ్‌పై కూడా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారీ శబ్దాలు వచ్చే సైలెన్సర్లు బైక్‌లకు ఉంటే కేసులు తప్పవని హెచ్చరించారు.

మాట్లాడుతున్న ఎస్ఐ సతీశ్

పాముకాటుకు గురైన చిన్నారి మృతి

జాన్సన్(ఫైల్)

మందమర్రి, జూలై 7: మందమర్రి పట్టణంలోని గాంధీనగర్‌లో పాముకాటుకు గురైన చిన్నారి జాన్సన్(10 నెలలు) చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. సీసీసీ నస్పూర్‌కు చెందిన కీర్తి జీవన్ కుమార్ దంపతులు కుమారుడు జాన్సన్‌తో కలిసి పది రోజుల క్రితం గాంధీనగర్‌లోని తల్లిగారింటికి వచ్చారు. ఈ నెల 2న రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో చిన్నారిని పాము కాటు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు మంచిర్యాల దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఆరు రోజులుగా ఎంజీఎంలో చికిత్స పొందుతున్న జాన్సన్ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు.

ఏజీపీగా సత్యం

ఏజీపీ వీ సత్యం

లక్షెట్టిపేట, జూలై 7: లక్షెట్టిపేట న్యాయస్థానంలో న్యాయవాదిగా పనిచేస్తున్న వేల్పుల సత్యంను ఏజీపీగా నియమిస్తూ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఈ నెల 6న ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయవాది సత్యం ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ పూర్తి చేసి 2015 నుంచి 2018వరకు మూడేళ్ల హైకోర్టులో ప్రాక్టీస్ చేసిన అనంతరం లక్షెట్టిపేట న్యాయస్థానంలో న్యాయవాదిగా విధులను కొనసాగిస్తున్నారు. సత్యంకు తోటి న్యాయవాదులు, మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

చినుకు పడితే చిత్తడే..

సీసీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఆసిఫాబాద్ మండలంలోని రాజుర గ్రామంలో సీసీ రోడ్డుపై వారం పది రోజులుగా వర్షపు నీరు నిలిచి ఉండడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వర్షపు నీరు నిలిచి ఉండకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

-ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 7

మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌కు నివాళి

- నస్పూర్‌లో సంతాప సభ

మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జూలై 7 : ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎంపీ, సీనియర్ నాయకుడు రాథోడ్ రమేశ్‌కు నివాళులర్పించేందుకు సంతాప సభను ఆదివారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో మాజీ సర్పంచ్, తెలంగాణా కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కుల రాజేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ మంత్రి బోడ జనార్దన్, జిల్లా బీఆర్ఎస్ నాయకులు ముఖేశ్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ తిప్పని రామయ్య, గురువయ్య మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంతాప సభలో వారు మాట్లాడుతూ 30 ఏళ్లపాటు జిల్లాలో జడ్పీటీసీగా, జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, ఎంపీగా రమేశ్ బాధ్యతలు చేపట్టి జిల్లా అభివృద్ధి, దళిత, గిరిజన బీసీల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెల్లంకొండ మురళి, బొడ్డు చిన్నయ్య, నాగేశ్వర్‌రావు, జక్కుల కుమార్, సాగర్, నాగరాజు, రాంజీ, కొప్పర్తి రాజం, రాంబాబు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్, జూలై 7 : అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయనిధి వరమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన క్వార్టర్లో జన్నారం మండలానికి కిష్టాపూర్‌కు చెందిన రాజేశ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి తక్షణ సాయంగా రూ.2.50 లక్షల ఎల్వోసీని అందించారు. పేదలు అనారోగ్యం పాలైనప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సీఎం రిలీఫ్ ద్వారా సహాయం అందిస్తుందన్నారు. ఈ పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.

ఎల్వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు →

దరఖాస్తు చేసుకోండి

కాసిపేట, జూలై 7 : కాసిపేట మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఖాళీగా ఉన్న స్కావెంజర్ పోస్టు భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కాసిపేట ఎంఈవో ప్రభాకర్ తెలిపారు. కేజీబీవీలోని స్కావెంజర్ పోస్టుకు అర్హులుగా 18 నుంచి 45 ఏళ్ల లోపు ఉండాలని. ఏడవ తరగతి పాసై ఉండాలన్నారు. నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు ఏడవ తరగతి పాస్ సర్టిఫికెట్, బోనాఫైడ్ సర్టిఫికెట్లతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. జూలై 10 సాయంత్రం 4 గంటలలో పు మండల విద్యావనరుల కేం ద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు

జాతీయ సదస్సుకు నిర్మల్ వాసికి ఆహ్వానం

నిర్మల్ అర్బన్, జూలై 7: మహారాష్ట్రలోని చారిత్రాత్మక ప్రదేశం వార్ధాలోని సేవా గ్రామ్ ఆశ్రమంలో జరిగే భారత్ జోడో అభియాన్ జాతీయ సదస్సుకు నిర్మల్‌కు చెందిన పరికిపండ్ల స్వదేశ్‌కు ఆహ్వానం అందింది. ఈ నెల 8,9 తేదీల్లో జరిగే జాతీయ సదస్సుకు దేశ వ్యాప్తంగా పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మేధావులు హాజరవుతున్నారని ఈ జాతీయ సదస్సుకు కన్వీనర్ యోగేంద్ర యాదవ్ హాజరువుతున్నారని తెలిపారు.

జన్నారం పొనకల్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ఊరూరా పోచమ్మకు బోనాలు

జన్నారం, జూలై 7 : మండల కేంద్రంలోని పొనకల్ గౌడ సంఘం ఆధ్వర్యంలో సామూహికంగా పోచమ్మ, ఎల్లమ్మకు బోనాలను భక్తులు తీసుకెళ్లి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు అక్కడ వంటలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎం భాస్కర్‌గౌడ్, పొన్కల్ పట్టణ అధ్యక్షుడు పీ సతీశ్‌గౌడ్, జిల్లా నాయకుడు బాలసాని శ్రీనివాస్‌గౌడ్, ఎరుకల శంకర్‌గౌడ్, రమేశ్‌గౌడ్, లింగాగౌడ్, సతీశ్‌గౌడ్, మహిళా భక్తులు పాల్గొన్నారు.

మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో..

మండల కేంద్రంలోని పొనకల్ మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాసంలో మొదటి ఆదివారం వీర్లగుట్టపైన గల కేతేశ్వర కంకాలమ్మ ఆలయంలో పూజలు చేయడం ఆనవాయితీ. ఆదివారం పూజలు చేసి ఆలయ ఆవరణలో వంటలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమం మహేంద్ర సంఘం మండల అధ్యక్షుడు ఎమ్మార్ నర్సింగారావు, కోడి జుట్టు రాజన్న, సీహెచ్ నర్సయ్య, పిల్లి నర్సయ్య, అంజయ్య తదితరులున్నారు.

తాండూర్ మండలంలో..

తాండూర్, జూలై 7 : ప్రతి ఏటా వర్షాకాలం ప్రారంభం కాగానే (పస్క నైవేద్యాలు) సమర్పించి, వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని పూజలు చేయడం ఆనవాయితీ. ఆదివారం తాండూర్ మండలంలోని పలు గ్రామాలు, సింగరేణి కార్మిక కాలనీల్లో గ్రామస్తులు, వాహనదారులు, ట్రాలీల యజమానులు, ఆటో డ్రైవర్లు తమ యూనియన్ల ఆధ్వర్యంలో సైడ్ పిల్లల పూజలు చేశారు.

కన్నెపల్లి, భీమిని మండలంలో..

కన్నెపల్లి, జూలై 7 : కన్నెపల్లి, భీమిని మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఆదివారం పసక నైవేద్యాలు పోచమ్మ తల్లికి సమర్పించారు. గ్రామాల్లోని గ్రామదేవతలకు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సిర్సా గ్రామంలో బోనాల సందడి

కోటపల్లి, జూలై 7 : కోటపల్లి మండలంలోని సిర్సా గ్రామంలో బోనాల సందడి నెలకొన్నది. నేవైద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

నాయకపుగూడ చెరువు కట్ట మైసమ్మకు పూజలు

కాసిపేట, జూలై 7 : కాసిపేట మండలంలోని దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నాయకపుగూడ చెరువు కట్ట మైసమ్మకు గిరిజన రైతులు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో సిడం లాల్, బహదూర్, పూజారి కనక రాము, సిడం రామ్‌దాస్, సిడం జలపతి, కొమ్ముల సంజీవ్, రామ్‌చందర్, రైతులు పాల్గొన్నారు

కన్నెపల్లి : పోచమ్మ ఆలయానికి వచ్చిన భక్తులు

కాసిపేట : మొక్కులు చెల్లించుకుంటున్న ఆదివాసీలు

తాండూర్: బోయపల్లిలో మొక్కులు చెల్లించేందుకు పోచమ్మ ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఆర్థిక సహాయం

ఆర్థిక సహాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు

దండేపల్లి, జూలై 7 : దండేపల్లి మండలంలోని కాసిపేటకు చెందిన కోట్నాక మాన్కు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో మానవత దృక్పథంతో హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు రూ.5వేల ఆర్థిక సహాయం ఆదివారం కుటుంబ సభ్యులకు అందించి ఔదార్యం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మైదం గంగారెడ్డి–యశోద, శంకర్, హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు కల్లెం రాజన్న, అప్పాల సునీల్, బక్కశెట్టి వెంకటేశ్, లక్కాకుల వెంకటేశ్, మదాసు వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

ముగిసిన తిరుపతి యాత్ర

బెల్లంపల్లి, జూలై 7 : బెల్లంపల్లి పట్టణంలోని రాంజీగోండు ఆవాస విద్యార్థులు తిరుమల, తిరుపతి క్షేత్ర సందర్శన యాత్రను ముగించుకుని తిరిగి బెల్లంపల్లికి వచ్చారు. తిరుమల తిరుపతి దేవాస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గతనెల 30న బెల్లంపల్లి నుంచి బయలుదేరిన మొత్తం 21 మంది విద్యార్థులు తిరుమల యాత్రకు తరలివెళ్లారు. గిరిజన బిడ్డల్లో ఆధ్యాత్మికతను పెంచేందుకు దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు యాత్ర కో ఆర్డినేటర్ ఆసం ఏడు కొండల్ తెలిపారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- తెలంగాణ రాష్ట్ర ఆర్టిస్టుల సంక్షేమ సమితి

రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్

మాట్లాడుతున్న ఆర్టిస్టుల సంక్షేమ సమితి నాయకుడు రాజేశ్వర్

జన్నారం, జూలై 7 : తెలంగాణలోని ఆర్టిస్టుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకునేందుకు వెంటనే ఆర్టిస్టుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్టిస్టుల సంఘం రాష్ట్ర నాయకుడు తాళ్లపెల్లి రాజేశ్వర్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ఆర్టిస్టుల సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో టెండర్ విధానం ద్వారా వేసే పెయింటింగ్ పనులను రద్దుచేసి నామినేటెడ్ పద్ధతిలో ఇవ్వాలని, 55 ఏళ్లు నిండిన చిత్రకారులకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని, తదితర డిమాండ్లపై తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆర్టిస్టుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థలో నూ కుల వివక్ష..?

- ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కల్వల శరత్ మాదిగ

కాసిపేట, జూలై 7 : చట్టాన్ని కాపాడాల్సిన పోలీస్ వ్యవస్థలో కుల వివక్ష చూపి వేధించి ఓ ఎస్ఐ ఆత్మహత్య చేసుకునే విధంగా కుల అహంకారంతో ప్రవర్తించిన సీఐ జితేందర్‌రెడ్డిని విధుల నుంచి బహిష్కరించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎంఆర్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కల్వల శరత్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెడ్లు, అగ్రవర్ణ అహంకార పరిపాలన మితిమీరి పోయిందని, సీఐ జితేందర్ రెడ్డి రెడ్డి కాబట్టే దళిత ఎస్ఐ శ్రీనివాస్‌ను అశ్వరావుపేట పోలీస్‌స్టేషన్‌లో అనేక రకాలుగా మానసికంగా వేధిస్తూ సీఐతో పాటు కొంతమంది కానిస్టేబుళ్లు సీఐతో కుమ్మక్కై, ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్‌ను ఆత్మహత్య చేసుకునే విధంగా వేధింపులకు గురి చేశారన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసు అధికారులను కూడా దళితులు అనే కారణంతో చిన్న చూపు చూస్తూ అధికారులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రభుత్వం కూడా చూసీ చూడనట్లు వ్యవహరించడం చాలా దారుణమని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వంలో పోస్టింగ్‌లలో కూడా దళిత అధికారులకు పోస్టింగ్ లేకుండా పోయిందని, అంటే దళిత అధికారులు పోస్టింగ్‌కు పనికిరారా, అగ్రవర్ణ అధికారుల ఆటలు ఇక నుంచి సాగనివ్వమని, తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకొని, దీంట్లో ఎవరెవరికి భాగస్వామ్యం ఉందో విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేయాల్సిందిగా కోరుతున్నట్లు పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తనిఖీలు చేస్తున్న ఎస్ఐ ప్రవీణ్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 7: సరైన ధ్రువీకరణపత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రవీణ్ అన్నారు. ఆదివారం సాయంత్రం పోలీస్ సిబ్బందితో కలిసి జిల్లా కేంద్రంలో వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వారిపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో సిబ్బంది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీపీకి సన్మానం

ఎంపీపీని సన్మానిస్తున్న కొమ్మెర యువకులు

చెన్నూర్ రూరల్, జూలై 7: చెన్నూర్ ఎంపీపీగా ఐదేళ్లు పూర్తి చేసుకొని ఇటీవల పదవీ విరమణ పొందిన మంత్రి బాపును కొమ్మెర యువకులు ఆదివారం ఎంపీపీ నివాసంలో సన్మానించారు. కేసీఆర్ సర్కార్ హయాంలో కొమ్మెర గ్రామపంచాయతీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, రింగ్ రోడ్డుతో పాటు పలు అభివృద్ధి పనులను ఎంపీపీ చేట్టారని యువకులు కొనియాడారు.

ప్రమాణ స్వీకారం

నస్పూర్, జూలై 7 : మంచిర్యాల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ కార్యవర్గ సభ్యులప్రమాణ స్వీకారం గౌరవాధ్యక్షుడు, మాజీమున్సిపల్ చైర్మన్ ముఖేశ్ గౌడ్ అధ్యక్షతన ఆదివారం ఓ ఫంక్షన్‌హాలులో నిర్వహించారు